క్లుప్తంగా

ఢిల్లీ తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఢిల్లీ బయలు దేరిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పైల శ్రీనివాసరావు తదితరులు

పరవాడ: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై దేశ రాజధాని ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు పెందుర్తి నియోజకవర్గ నాయకులు తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో తరలివెళ్లిన వారిలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ నేతలు పాలిశెట్టి సురేష్, మోపాడ అప్పారావు, రాజేష్, పల్లా అప్పారావు, ముదపాక శివ, మట్ట ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘ ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఎంఎస్ జెండాను ఆ సంఘం అఖిల భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు ఆవిష్కరించారు. రాష్ట్ర కోశాధికారి లాలం ప్రసాద్ మాట్లాడుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బొట్టా రమణ, ప్రధాన కార్యదర్శి కూండ్రపు సతీష్, గొర్లి నాగభూషణం, బండారు బాలాజీ, బండారు నరసింహమూర్తి, టి.శ్రీను పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ పరిధిని కాపాడాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతంలో ఆక్రమణకు గురవుతున్న సీఆర్‌జెడ్ పరిధిని కాపాడాలని గ్రామ మత్స్యకారులు కోరారు. ఈ మేరకు మత్స్యకారులు మంగళవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తీరం వెంబడి సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న భారీ చెట్లను కొంతమంది తొలగిస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీ అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ సర్టిఫికెట్లు లేకుండా లేఅవుట్లు వేసి సీఆర్‌జెడ్ పరిధిని జిరాయితీగా చూపిస్తున్నారన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని సీఆర్‌జెడ్ పరిధి యధావిధిగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన కె.మహేష్, కొవిరి నంబారి, సీహెచ్.కొర్లయ్య, ఎం.మహేష్ తదితరులు కోరారు.

మిత్రుల ఔదార్యం



మిత్రుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన తోటి పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలలో 1985–86 విద్యా సంవత్సరంలో పదోతరగతి తమతో కలిసి చదివి ఇటీవల అనారోగ్యంతో రావలమ్మపాలేనికి చెందిన సలుమూరి శ్రీరాములు మృతిచెందారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బవరపు నరసింహమూర్తి,కామిరెడ్డి రాము, కొల్లి వెంకట రమణ,లాలం సుజాత, దొగ్గ చల్లారత్నం,ఒమ్మి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల ముందు బోలెడు హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ పేరుతో పలు ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తామని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వీటిలో ఒక్క దాని గురించి కూడా ఇంత వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. అధికారంలోకి వచ్చి దాదాపు 45 రోజులు కావస్తోంది. కక్ష సాధింపులకు స్వస్తి పలికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'అని అంటూ పలువురు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కోరుతున్నారు. పెందుర్తి నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి, పరిష్కార మార్గం చూపాలని కోరుతున్నారు.



గళమెత్తాలి.. దశమార్చాలి



పంచగ్రామాల భూములు, నివాస ప్రాంతంలోని ఓ భాగం

- దశాబ్దాలుగా పరిష్కారం కాని పంచగ్రామాల భూ సమస్య
- తాడి గ్రామ తరలింపుపై వీడని సందిగ్ధత
- సమస్యలపై ఎమ్మెల్యే పంచకర్ల గళం వినిపించాలని ఆకాంక్ష

పెందుర్తి/పరవాడ: సింహాచలం దేవస్థానం పరిధిలో దీర్ఘకాలికంగా పరిష్కారానికిని నోచుకోని పంచగ్రామాల భూ సమస్యను కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానంగా చర్చిస్తాం. తప్పకుండా పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఇక్కడి ప్రజలకు మేలు జరిగేలా కృషి చేస్తాం..అలాగే కాలుష్యం బారిన ఉన్న పరవాడలోని తాడి గ్రామం తరలింపు వెంటనే జరిగేలా చూస్తాం' పెందుర్తిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రస్తుత ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమక్షంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. అలాగే పెందుర్తి నియోజకవర్గంలో పలు సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

వీటిలో ముఖ్యంగా పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం, కాలుష్యం బారిన పడిన తాడి గ్రామం తరలింపు, పరవాడలోని ఫార్మా, ఎన్టీపీసీ, హిందుజా వంటి కంపెనీల్లో యువతకు ఉపాధి కల్పన అంశాలపై స్పష్టమైన హామీలు ఇచ్చారు. ఆయా హామీలను నమ్మి ప్రజానీకం రమేష్‌బాబును మంచి మెజారిటీతో గెలిపించారు. ఇప్పుడు తమ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలపై అసెంబ్లీ వేదికగా గళం వినిపించాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు. పరిష్కారం చూపాలని విన్నవిస్తున్నారు.

పంచగ్రామాలపై చర్చించాలి



సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచగ్రామాల భూ సమస్య ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల ఎన్నికల సమయంలో భూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారి మాటలు నమ్మాం. ఇప్పుడు వారికి మంచి అవకాశం వచ్చింది. ఇక్కడి ప్రజల ఆకాంక్ష మేరకు సమస్యపై అసెంబ్లీలో గళం వినిపించి పరిష్కారానికి కృషి చేయాలి.

– జెట్టి సోముశేఖర్, వేపగుంట

కాలుష్యం నుంచి కాపాడండి



ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకున్న కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామ ప్రజలను సురక్షిత ప్రదేశానికి తరలించాలి. ప్రజల ప్రాణాలను కాపాడడానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కృషి చేయాలి. సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలి. కాలుష్యంతో గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడి సతమతమవుతున్నారు.

– బొండా కనకారావు, సర్పంచ్, కలపాక

తాడి గ్రామాన్ని తరలించడానికి చర్యలు తీసుకోవాలి



ఫార్మా కాలుష్యంతో సతమతమవుతున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఎమ్మెల్యే పంచకర్ల కృషి చేయాలి. అనేక ఏళ్ల నుంచి పీడిస్తున్న తాడి సమస్యపై ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పంచకర్ల చొరవ చూపి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించడానికి కృషి చేయాలి. భూ గర్భ జలాలు సైతం కాలుష్యం కావడంతో మూగజీవాలు సైతం ఇబ్బంది పడుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే పంచకర్ల చొరవ తీసుకొని తాడి సమస్య పరిష్కరించాలి.

– శీలం నదియా, ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్, తాడి

ఉత్సాహంగా శిక్షా సప్తాహ్

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగంగా వారం రోజుల పాటు శిక్షా సప్తాహ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు లక్ష్మణరావు,ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే తుపాను ప్రభావంతో సోమవారం పాఠశాలకు సెలవు దినం కావడంతో మంగళవారం ప్రారంభించారు. స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శన, పునాది అభ్యసన సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి, క్రీడా పోటీల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు,26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం ,27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు లక్ష్మణరావు,ఎస్ఎన్ మూర్తి తదితరులు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డెంగ్యూ మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ వ్యాధులు ప్రబలడానికి కారణాలను విద్యార్థులకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యాధి కారక దోమలు మంచినీటిలో పెరుగుతాయని వివరించారు. కుండీల్లో దోమ లార్వా పెరగకుండా డ్రమ్ములపై మూతలు పెట్టాలని .. వారంలో ఒక రోజు వాటిని శుభ్రం చేయాలని తెలిపారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా సోకినట్లు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మృదుల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాలలో సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్

'వారి త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం'

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర సమరయోధులు లోకమాన్య బాల గంగాధర్ తిలక్,చంద్రశేఖర ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి బాల గంగాధర్ తిలక్,చంద్రశేఖర ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖల త్యాగం ,వారి పోరాట ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు.వారి పోరాటాలను,సాహసాలను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని స్వేచ్ఛాయుత భారతదేశం కోసం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్,అధ్యాపకులు లెక్కల గణేష్, డాక్టర్ ఎస్ సత్యనారాయణ,ఎంవీ రామకృష్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌లు చెల్లించాలి

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న అలవెన్స్‌లను తక్షణం ప్రభుత్వం చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ మోహనరావును మంగళగిరిలో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సానుకూలంగా స్పందించారని, త్వరలో బకాయిలు చెల్లించనున్నామని చెప్పారని రమణారెడ్డి తెలిపారు. డిపోల వారీగా బకాయి ఉన్న ఉద్యోగులకు వేతనంతో కలిపి చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ మోహనరావుకు వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కల్యాణం.. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలను అందజేశారు.

బంగారు వస్తువులు పోగొట్టుకుంటే సంప్రదించండి



బంగారు వస్తువులు

సీతమ్మధార : ఇటీవల బంగారు వస్తువులు పోగొట్టుకుంటే తగిన రశీదులతో ఫోర్త్ టౌన్ క్రైం పోలీసులను సంప్రదించాలని స్టేషన్ ఎస్ఐ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది నెలల కిందట దొండపర్తిలోని ఒక ఆటో డ్రైవర్‌కు మండగొలుసు, డైమండ్ పార్కు దరి సాయి పార్లర్ వద్ద చైను దొరికాయని తెలిపారు. వీటి కోసం ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో 106 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. వస్తువులు పోగొట్టుకున్న బాధితులు తగు ఆధారాలతో క్రైం పోలీసులను సంప్రదించాలని, రశీదులు పరిశీలించి వస్తువులు ఇచ్చేస్తామని తెలిపారు.

కందిపప్పు నాణ్యత పరిశీలన

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు నాణ్యతను పౌరసరఫరాల శాఖ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్ పి.ప్రవల్లిక తనిఖీ చేశారు. విక్రయిస్తున్న సరుకుతో పాటు, ప్యాకింగ్‌లో ఉన్న కందిపప్పు, బియ్యం బస్తాలను పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీఎం యాసిన్ నరసింహనగర్ రైతుబజార్‌లో పర్యటించారు. స్టాల్స్‌లో విక్రయిస్తున్న కూరగాయల నాణ్యత, తాజాదనం పరిశీలించారు. ప్రభుత్వం సబ్సిడీపై విక్రయిస్తున్న టమాటల కౌంటర్లు తనిఖీ చేశారు. డ్వాక్రా వ్యాపారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.



నరసింహనగర్ రైతుబజార్‌లో కందిపప్పు నాణ్యత పరిశీలిస్తున్న అధికారి ప్రవల్లిక

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి

ఎస్పీ ఎం. దీపిక

సబ్బవరం: వివిధ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని ఎస్పీ ఎం. దీపిక సూచించారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ దీపిక మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న వాహనాలను ఏ కేసుల్లో సీజ్ చేశారు, ఆ వాహనాలు స్టేషన్ ప్రాంగణంలో ఉండి పోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. సీజ్ చేసిన వాహనాలకు ఆయా కేసుల వివరాలను ట్యాగ్ చేయాలని ఆదేశించారు. తరుచూ రిపోర్టు అవుతున్న నేరాలపై ఆరా తీశారు. రౌడీ షీటర్స్,చెడునడత కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా అక్రమ రవాణాకు కారకులైన ప్రధాన వ్యక్తులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన గంజాయి కేసుల సీడీ ఫైల్స్,తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి ఆయా కేసుల పురోగతిని తెలుసుకొని పలు సూచనలు చేశారు. విజబుల్ పోలీసింగ్ చేయాలని,నేర నియంత్రణకు,రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ పిన్నింటి వెంకటరమణతో పాటు మిగిలిన సిబ్బంది పాల్గొన్నారు.



సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ దీపిక

సకాలంలో ప్రసూతి వైద్య సేవలు

డాక్టర్ లూసీ

పరవాడ: ప్రసూతి వైద్య సేవలు సకాలంలో అందించాలని టాస్క్ ఫోర్స్ బృందం వైద్యాధికారి లూసి వెన్నలపాలెం ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచించారు. టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు మంగళవారం వెన్నలపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ అమలు జరుగుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ లూసి మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం జరిపించి పుట్టిన బిడ్డకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియా, మలేరియా, ఎన్సీడీసీ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీకరిష్మా, డీపీహెచ్ ఎన్.నాగమణి, డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు, డేటా మేనేజర్ వై.జనార్దన్‌రావు, సీహెచ్‌వో ఎం.ఎస్.ఎస్.సాయిరాం, హెచ్‌వీ పీవీ రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ లూసీ

ఇక్కడ కఠినం..అక్కడ నిర్లక్ష్యం



పోలీసులు నిలిపివేయడంతో వర్షంలో తడుస్తూ పిల్లలను తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థి

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో పాఠశాలలకు విద్యార్థులను తీసుకువెళ్తున్న కొన్ని ఆటోలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణాలు సాగిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను ఆటోల్లో ఎక్కించుకోవడంతో వారు వెనుక భాగంలో అత్యంత ప్రమాదకరస్థితిలో కూర్చుంటున్నారు. ఆటో నడుపుతున్న డ్రైవర్లు వీరి పరిస్థితిని గమనించే అవకాశం లేదు. గుంతలు, స్పీడ్ బ్రేకర్ల వద్ద విద్యార్థులు జారిపడే అవకాశాలు ఉన్నాయి. దీనిపై పోలీసులు దృష్టి పెట్టకపోవడంతో ఈ తరహా ప్రయాణాలు నిరంతరం సాగుతున్నాయి.

ఇక్కడ విభిన్నం : సుజాతనగర్‌లో పలు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటికి చేరుకోవాలంటే సుజాతనగర్ కూడలి వద్ద 25 మీటర్ల దూరం రాంగ్ రూట్‌లో వెళ్లాలి. ఇక్కడ పాఠశాలలు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒకరిద్దరు ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తే సరిపోతుంది. అయితే పోలీసులు ఇక్కడ ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారు. దీంతో25 మీటర్లు రాంగ్‌రూట్‌లో వెళ్లాల్సిన వారు దాదాపు 2.5 కిలోమీటర్లు(రాను పోను) దూరం ప్రయాణం చేసి పాఠశాలలకు చేరుకోవాల్సి వస్తుంది. కొందరు అక్కడే వాహనాలు పార్కింగ్ చేసి పిల్లలను నడుచుకుంటూ తీసుకువెళుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉక్కు పరిరక్షణకు కేటాయింపులేవీ?

- బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు మొండిచెయ్యి
- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1258వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

అగనంపూడి: ఎన్నికల ముందు విశాఖ ఉక్కు పరిరక్షణ మా వల్లే సాధ్యమని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం నేడు పరిరక్షణకు బడ్జెట్‌లో కనీస కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1258వ రోజు, మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో పొందుపర్చిన కేంద్రం విశాఖ ఉక్కు విషయంలో మాత్రం కనీసం కేటాయింపులు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఆర్థిక సహాయం అందించాలని మూడున్నర సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోపోవడం, తీరా ఎన్నికల్లో ప్రజలకు బీజేపీకి సముచిత స్థానం ఇచ్చినా కూడా మొండిచేయి చూపడం దుర్మార్గమన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇదే తీరు కనపర్చారన్నారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా నమ్మక ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంపై ఎలాంటి అభిప్రాయం, ప్రేమాభిమానాలు ఉన్నాయో స్పష్టం అవుతోందన్నారు. కనీసం రెండు శాతం ఓట్లు కూడా లేని బీజేపీని పోటీ చేసిన దాదాపు అన్నిప్రాంతాల్లో గెలిపించిన రాష్ట్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహం అంతులేనిదన్నారు. దీక్ష శిబిరంలో నాయకులు కొమ్ము ప్రసాద్, పీవీబీవీ గోపాలరాజు, డి.ఆదినారాయణ, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జి.ప్రభాకర్ రెడ్డి, జి.గురుమూర్తి, మధు, వై.శ్రీను, ఆకుల నూకరాజు, దండు మోహన్, మద్ది అప్పలరాజుతో పాటు ఉక్కు పరిరక్షణ కమిటీ, ఇంటక్ నాయకులు, సీవో అండ్ సీసీపీ, సీఆర్ఎంపీ, ఈఎండీ, ఈఆర్ఎస్, డీఎన్‌డబ్ల్యూ, సీఎంఈ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

అక్కిరెడ్డిపాలెం: ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో కన్వీనర్ కోటా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినట్లు బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఇంటర్‌లో ఏ గ్రూపులో పాసైన విద్యార్థులైనా ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79950 13421, 72079 53919 సెల్ నంబర్లకు, లేదా షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్ నందు సంప్రదించాలని కోరారు.